


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 657 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర శుక్రవారం 06 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం

## అనురాగ్ ఠాకూర్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట

### బీసీసీఐలో ఇక పదవులు చేపట్టవచ్చు...

దాదాపు 9 ఏళ్లుగా కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తివేసిన సుప్రీంకోర్టు
లోధా కమిటీ సిఫార్సుల వివాదంలో 2017లో ఠాకూర్ పై వేటు
ఇది జీవితకాల నిషేధం కాదని స్పష్టం చేసిన న్యాయస్థానం
బీసీసీఐ వ్యవహారాల్లో పాల్గొనేందుకు ఠాకూర్‌కు తాజాగా అనుమతి



5

# ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యం

- వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు మేమే చెల్లిస్తాం: సీఎం చంద్రబాబు
-సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ ఉండదని కీలక హామీ
-వైసీపీ ప్రభుత్వంలో పెండింగులో ఉన్న బిల్లులు కూడా చెల్లిస్తామని భరోసా
-పరుగెత్తే నీటిని నిలిపి భూగర్భ జలాలు పెంచాలని సంఘాలకు సూచన
-ప్రత్యామ్నాయ పంటలతో రైతుల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడి

రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యతను నీటి వినియోగదారుల సంఘాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించే బాధ్యత తమదేనని ఆయన కీలక హామీ ఇచ్చారు. గురువారం అమరావతిలో నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నీటి భద్రత అందరికీ అవసరం కానీ, దాని సంరక్షణపై చాలా మందికి శ్రద్ధ లేదు. పరుగెత్తే నీటిని నిలపాలి, నడిచే నీటిని జలాశయంగా మార్చాలి. అప్పుడే భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది" అని సూచించారు.

6



## బొగ్గు గనిలో పేలుడు...

### 16 మంది మృత్యువాత

మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
ఘటనలో 16 మంది కార్మికులు మృతి
మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు



6

# దేశ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది

-సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటన

-బీఎస్ఎఫ్ అధికార పరిధి నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. అయితే అంతకంటే ముందు బీఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు

6



# తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి: కిషన్ రెడ్డి

ఏపీలో ఎన్నో విమానాశ్రయాలు ఉన్నా తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్న
కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శ
దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే వెళుతున్నాయని ఆగ్రహం

తెలంగాణను రక్షించుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని, ఏపీలో విమానాశ్రయాలు ఉన్నాయి కానీ తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, తెలంగాణ నుంచే డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే.





# స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

## - : కేటీఆర్

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం రాజ్యాంగానికే గొడ్డలిపెట్టు అని, ఈ విషయంలో మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌ను స్పీకర్ డిస్మిస్ చేయడంపై స్పందించారు. ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫొటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా.. ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు.



# భారత్‌కు అమెరికా కీలక సూచనలు

అమెరికా, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : చైనా విషయంలో భారత్‌కు అమెరికా కీలక సూచన చేసింది. డ్రాగన్ కంట్రీతో ఎల్లప్పుడూ అప్రమత్తతతో ఉండడం మంచిదని హెచ్చరించింది. చైనా భారత్‌పై ఏ క్షణానైన దాడికి తెగబడవచ్చని అమెరికా మెరైన్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి గ్రాంట్ న్యూషామ్ భారత్‌ను హెచ్చరించారు. 2049 వరకూ చైనా తనను ప్రపంచంలోనే సూపర్ పవర్‌గా స్థాపించుకోవాలనుకుంటుందని, తైవాన్‌తో సమస్య ఉన్న సమయంలోనే అకస్మాత్తుగా మరో దేశంపై దాడి చేసే అవకాశం ఉందని, అందులోనూ భారత్ తొలిస్థానంలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గల్వాన్ లోయ వివాదాన్ని ఆయన ప్రస్థావించారు.



# 2029 ఎన్నికల్లో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా "రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్"

## - ధీమా వ్యక్తం చేసిన అర్పిసి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : 2029 ఎన్నికల్లో "రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్" ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ కాబోతుందని విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేసారు. ఆంధ్రప్రదేశ్ లో పాలకుల పనితీరు ఆంధ్రులను భయపెడున్నాయని, కక్ష పూరిత రాజకీయాలు తప్ప ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలకు ఏ మాత్రం ఉపయోగం లేకపోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో గల 175 శాసన సభ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేసే దిశగా అర్పిసి ఆంధ్రప్రదేశ్ శాఖ శ్రీకారం చుట్టిందన్నారు. ఓటును ఇవ్వండి - సంపదను ఇస్తాం అనే నినాదంతో పేదరికం లేని సంపన్న రాష్ట్రాన్ని సాధించి చూపిస్తాం అన్నారు. ప్రధానంగా ప్రైవేట్ విద్యా - వైద్య విధానాన్ని పూర్తిగా రద్దు చేసి అదునాతన విధానాలతో ఉచిత విద్యా - వైద్యాన్ని అమలు చేస్తామని, రూ. 200/- లకే వంటగ్యాస్ సిలెండర్ ను సరఫరా చేస్తామన్నారు. పరిశుభ్ర మైన త్రాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తాం అని ఈ దిగువ పేర్కొన్న 29 అంశాలతో కూడిన ప్రమాణ పత్రాన్ని మేడా శ్రీనివాస్ ప్రకటించారు.



1. ప్రైయివేటు, కార్పొరేట్ విద్యా-వైద్యాన్ని పూర్తిగా రద్దు చేస్తాం. అధునాతన విధానాలతో ఉచిత విద్యా- అమలు చేస్తాం. బిడ్డల భవిష్యత్తుకు ఆదర్శంగా నిలుస్తాం. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ను సాధిద్దాం.
2. రైతు జీవితానికి వెన్నుదన్నుగా నిలవటానికి 100/- రూవలకే ఎరువుల బస్తా సరఫరా చేస్తాం. రైతు సమస్యలకు అండగా నిలుస్తాం.
3. రూ. 200/- లకే వంటగ్యాస్ సిలెండర్ సరఫరాను అమలు చేస్తాం.
4. ప్రతి జిల్లాలోను మానవ హక్కుల సంఘాలను ప్రభుత్వ పరంగా నియమించి ప్రజల హక్కులకు బాధ్యతగా నిలుస్తాం.
5. 2014 విభజన చట్టం అమలును సాధించి తీరుతాం. రాష్ట్ర ప్రగతికి, ఆత్మ గౌరవానికి పునాదులుగా నిలుస్తాం.
6. మెరుగైన / శుభ్రమైన త్రాగునీరును ఉచితంగా సరఫరా జరిపిస్తాం.
7. ప్రకృతిని, సహజ వనరులను కాపాడుతూ ప్రజలందరిని పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతాం.
8. ఇప్పటికే తరలిపోయిన కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల స్థానంలో అందుకు ధీటైన సంస్థలను ఆంధ్రప్రదేశ్కు సాధించి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాం.
9. వాల్తేరు (విశాఖ) డివిజన్తో కూడిన విశాఖ రైల్వే జోను, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్సు ఆంధ్రప్రదేశ్ లోనే నెలకొల్పే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సాధించి తీరుతాం.
10. విభజన చట్టంపై ఇరు తెలుగు రాష్ట్రాలకు అద్భుతమైన మంచి భవిష్యత్తు ఉండే విధంగా పార్లమెంట్లో పునర్ చర్చకు కృషి చేస్తాం. భవిష్యత్తులో ఇరు తెలుగు రాష్ట్ర ప్రజల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తని విధంగా భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాం.
11. రాజకీయ కుట్ర పూరితంగా పేరు మార్చి ఆంధ్రుల ఆత్మ గౌరవానికి తూట్లు పొడిచిన "ఆంధ్రా బ్యాంక్" పేరును తిరిగి సాధించి ఆంధ్రుల ప్రతిష్టను కాపాడుతాం.
12. మహిళలకు, వృద్ధులకు, పసి బిడ్డల రక్షణకు ప్రత్యేక చట్టం ద్వారా శాశ్వత భద్రత కల్పిస్తాం.
13. మారు మూల గ్రామలలో సైతం మౌలిక వసతులు / సౌకర్యాలు పక్కగా అమలు పరుస్తాం.
14. పేదరికాన్ని / నిరుద్యోగాన్ని పరిపూర్ణ స్థాయిలో నియంత్రించి సంపదను సామాన్యుల దరికి చేరుస్తాం.
15. నకిలీ నిత్యావసర సరుకులు, రసాయినిక పండ్లు, కూరగాయలు, కల్తీ పాలు కాకుండా స్వచ్ఛమైనవి మార్కెట్టులో లభ్యమయ్యే విధంగా కఠిన చర్యలు అమలు చేస్తాం.
16. క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి పరుచుట, క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ద్వారా వారిని ప్రోత్సహించుట జరిపిస్తాం.వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తాం.
17. ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన పౌర సేవలు అమలు జరిపించి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తాం.
18. గంజాయి తదితర మత్తు పదార్థాలకు యువత బానిసలు కాకుండా మెరుగైన పద్ధతుల ద్వారా పూర్తి రక్షణ కల్పిస్తాం.
19. మెరుగైన పర్యాటక అభివృద్ధిని సాధించి రాష్ట్ర అభివృద్ధికి సంపదను సృష్టిస్తాం.
20. ప్రతి కుటుంబానికి ఉద్యోగ, ఉపాధి మార్గాలను అభివృద్ధి పరచి మెరుగైన సంపన్న ప్రగతిని సాధించి తీరుతాం.
21. అన్ని జిల్లాల అభివృద్ధిని ప్రజలకు చేరువ చేస్తాం. అద్భుతమైన శాశ్వత రాజధాని నిర్మాణాన్ని సాధించి రాష్ట్ర ప్రగతికి ఆదర్శంగా నిలుస్తాం.
22. వలసలకు తావులేని విధంగా స్థానిక జిల్లాల లోనే మెరుగైన ఉపాధి మార్గాలను ప్రజలకు చేరువ చేస్తాం.
23. విద్యావంతులు ఉపాధి అవకాశాల కోసం ఇతర దేశాలకు, రాష్ట్రాలకు తరలిపోకుండా స్వరాష్ట్రం లోనే అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు పొందే విధంగా ప్రభుత్వం తరపున అండగా నిలుస్తాం.
24. ఆంధ్ర రాష్ట్రంలో యాచకత్వానికి అవసరంలేని విధంగా యాచక రహిత సమాజాన్ని అభివృద్ధి పరిచి రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటుతాం.
25. 5 ఏళ్ళ వరకు గృహ అవసరాల విద్యుత్ ఛార్జీలను పెంచని విధంగా పాలనా విధానాలను అమలు చేస్తాం.
26. ప్రతి గ్రామం లోను రెవెన్యూ కోర్టులను నెలకొల్పి కాలయాపన లేని విచారణా తీర్పుల ద్వారా శాంతి భద్రతలకు ఆస్తులకు రక్షణగా నిలుస్తాం.
27. పోలీసు / రెవెన్యూ కార్యాలయాల్లో మెరుగైన సంస్కరణలను అమలుపరిచి ఆస్థి, ధన, మాన, ప్రాణాలకు శాశ్వత భద్రత కల్పించి తీరుతాం. సామాజిక హక్కులకు రక్షణగా నిలుస్తాం.
28. వ్యభిచారం, దొంగతనం, దోపిడిలు అవసరం లేని విధంగా మెరుగైన సంస్కరణలతో వారి జీవితాలకు మంచి మార్గం చూపుతాం. వారి జీవితాలకు రక్షణగా నిలుస్తాం.
29. కుల, మత, ప్రాంత వివాదాలకు తావులేని విధంగా స్థానికులతో శాంతి కమిటీలను ఏర్పరచి నిరంతర పర్యవేక్షణ జరిపిస్తాం. శాంతి భద్రతలను కాపాడటంలో అవిశ్రాంతంగా శ్రమిస్తాం.

ఈ నూతన ప్రత్యామ్నాయ రాజకీయ మహోన్నత ఉద్యమంలో యువతీ యువకులు భాగస్వాములు కావాలని, ఆంధ్ర రాష్ట్రానికి భవిష్యత్ అంతా మంచి రోజులేనన్నారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ తలపెట్టిన ఈ ప్రజా ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాట ఉద్యమ స్ఫూర్తితో సమానమన్నారు. ఈ చారిత్రాత్మకమైన ఉద్యమ పోరులో ప్రతి ఆంధ్రుడు భాగస్వాములు కావాలని మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డా. కొమ్మజు రమేష్, పంగులూరి బుచ్చిబాబు, మాజీ మున్సిపల్ కమిషనర్ డా. చదలవాడ హరిబాబు, పెండ్యాల కామరాజు, సిమ్మా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి భక్తులకి పులివెందుల ఎమ్మెల్యే జగన్ క్షమాపణ చెప్పాలి

## - పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ వాకపల్లి దేవి సూర్యప్రకాష్

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం అపవిత్రం చేసిన వైసీపీ నాయకుడు జగన్, అసలు కల్తీయే జరగలేదని అనడం హాస్యాస్పదంగా ఉందని, ఇది యావత్ హిందువుల మనోభావాలు దెబ్బతీయడంగానే భావిస్తామని పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్యప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీవారి లడ్డు తయారీలో అసలు ఆవునెయ్యి, ఆవుపాలు లేకుండానే, కెమికల్స్ తో కూడిన రసాయన పదార్థాలతో కల్తీ నెయ్యి సృష్టించి తిరుమల లడ్డూలో వాడారని సిట్ నివేదిక ఇవ్వటం జగన్ కు, ఆ పార్టీ నాయకులకూ కనిపించక పోవటం దారుణం, ఖచ్చితంగా, కల్తీ జరిగిందని సుమారు 60 లక్షల కిలోల నెయ్యి కల్తీ చేసి, 20 కోట్ల లడ్డులను కల్తీ నెయ్యితో తయారుచేసి దాని ప్రతిఫలంగా రూ.250 కోట్ల రూపాయలు వైసిపి ప్రతిఫలం పొందిన మాట వాస్తవం కాదని తేజోమూర్తుల ప్రశ్నించారు. ఈ పాపం ఊరికే పోదంటూ, ఈ పాపంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని ఆ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి కచ్చితంగా శిక్షిస్తాడని, 2019 పురోహితుల పై నుంచి 2024 వరకు దేవాలయాలపై, విగ్రహాలపై, రథాలపై, అర్చకల పై, దాడులు చేయించిన జగన్ హిందూ ధర్మాలను, సనాతన ధర్మాలను అవమానించినది మరచిపోయారా అని ప్రశ్నించారు. కల్తీ ఏ విధంగా జరిగిందా అని విషయం పక్కనబెట్టి అసలు వాస్తవానికి కల్తీ జరిగింది అని ఒప్పుకుని,ఇప్పటికైనా జగన్, వైసిపి నాయకులు తిరుపతి లడ్డులో కల్తీ చేసింది వైసీపీ అని ఒప్పుకుని, ఆ వెంకటేశ్వర స్వామికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



# సుబేదార్ హాని లెఫ్టినెంట్ వై. వెంకటరమణ గారి పార్థివ దేహానికి ఘన నివాళులు





మార్కాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : తురిమెళ్ళ గ్రామానికి చెందిన సుబేదార్ హాని లెఫ్టినెంట్ వై.వెంకటరమణ భారత సైన్యంలో సుమారు 30 సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించి, ఈనెల 3వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్కు గురై విధులు నిర్వహిస్తున్న సమయంలోనే వీరమరణం పొందారు. దేశ రక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆయన మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. వారి పార్థివ దేహాన్ని గురువారం తురిమెళ్ళ గ్రామానికి తీసుకువచ్చి, భారత సైనికుల ఆధ్వర్యంలో గౌరవ వందనం మధ్య ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి హాజరై, వెంకటరమణ పార్థివ దేహానికి పూలమాల వేసి గౌరవ నివాళులు అర్పించారు. దేశ సేవలో ఆయన చూపిన త్యాగం యువతకు ఆదర్శమని ఆయన అన్నారు. అంతిమయాత్రలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సైనికుల గౌరవ వందనం, దేశభక్తి నినాదాల మధ్య వీర జవాన్కు ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామం మొత్తం విషాద ఛాయలు అలుముకున్నాయి. దేశ భద్రత కోసం మూడు దశాబ్దాల పాటు కష్టపడిన వెంకటరమణ సేవలను స్థానికులు స్మరించుకుంటూ, ఆయన కుటుంబానికి తమ సానుభూతి తెలియజేశారు. ఆయన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.


# నేడు కరీంనగర్ జిల్లాకు రానున్న సీఎం రేవంత్



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : సీఎం రేవంత్ రెడ్డి నేడు చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌష్ ఆలం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణాలను పరిశీలించి, భద్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారీ పోలీస్ బందోబస్తుతో పాటు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

# నిజామాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి అగ్రనేతలు

నిజామాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : నిజామాబాద్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. రానున్న ఐదు రోజులు ప్రధాన పార్టీల అగ్రనేతలు ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ నెల 6న సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించనుండగా, 8న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్నర్ మీటింగ్లలో పాల్గొంటారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీతో పాటు మహారాష్ట్ర నేతలు కూడా 8న నిజామాబాద్ రానున్నారు. బీఆర్ఎస్ తరపున కేటీఆర్ కూడా ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉంది. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయి, అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన నేపథ్యంలో నేతల పర్యటనలతో ఎన్నికల హీట్ మరింత పెరిగింది.



# కాంగ్రెస్ షాక్..

## బీఆర్ఎస్తో పొత్తు పెట్టుకున్న సీపీఎం!

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మధ్య విచిత్ర పొత్తులు పొడుస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్తో జతకట్టిన లెఫ్ట్ పార్టీలు ఇప్పుడు తలో దారి వెతుక్కుంటున్నాయి. రెండు పార్టీలు తమకు అనుకూలంగా ఉన్న పార్టీలతో జత కడుతున్నాయి. సీపీఎం కొన్నిచోట్ల కాంగ్రెస్తో, మరికొన్ని చోట్ల బీఆర్ఎస్తో జతకడుతోంది. స్థానిక పరిస్థితులు, పార్టీ బలాబలాలను బట్టి ప్రధాన పార్టీలతో పొత్తులు పెట్టుకోవాలని సీపీఎం నిర్ణయించగా.. సీపీఐ మాత్రం కాంగ్రెస్తో సీట్ల సర్దుబాటు కోసం గట్టిగా పట్టుబడుతోంది.






# డీలర్ల సాయంతో పేదల రేషన్ బియ్యాన్ని మాయం

నందిగామ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : జగ్గయ్యపేట నందిగామ నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో రేషన్ మాఫియా ఆగడాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ మూడు మండలాల్లో పగలురాత్రి అనే తేడా లేకుండా భారీ వాహనాల ద్వారా పేదల రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. రేషన్ షాపుల నుంచి డీలర్ల సహకారంతో పేదల బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక ఈ రేషన్ మాఫియా వెనుక అధికార కూటమి పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఉన్నట్లు తెలుస్తుంది. మూడు మండలాల్లో రేషన్ మాఫియా నిర్వాహకులు సంబంధిత అధికారులకు నెలవారీ మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు బహిరంగంగానే చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంకా పేదల బియ్యం కొనుగోలు చేసిన వారిపై సమాచారం ఇస్తే, తరువాత ముడుపులు తీసుకుని చిన్నచిన్న వ్యాపారులు




పేదలపైనే కేసులు నమోదు చేయించి, అసలు మాఫియా నిర్వాహకులను తప్పించేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు వెంటనే స్పందించి రేషన్ మాఫియా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు



# ఎంఈఓకి సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు

నందిగామ, కంచికచర్ల, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఐఎఫ్టియు ఆధ్వర్యంలో పాల్గొనేందుకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మె నోటీసు ఎంఈఓకి అందజేశారు. గత ఐదు సంవత్సరాలుగా కేంద్ర కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఎంత మొత్తుకున్నా వినకుండా కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను మార్చేసి 4 లేబర్ కోడ్స్ గా ప్రవేశపెట్టి ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేసి కార్మికుల జీవితాలను రోడ్లు పాలు చేయాలని చూస్తుందన్నారు. ఈ తరుణంలో కేంద్ర కార్మిక సంఘాల ఇచ్చిన పిలుపులో భాగంగా కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఐఎఫ్టియు ఆధ్వర్యంలో కంచికచర్లలో ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, సమ్మెలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులమైన తామంతా పాల్గొంటామని తెలియజేస్తూ, సమ్మెలో పాల్గొనేందుకు అవకాశాన్ని కల్పించాలని కోరుతూ ఎంఈఓని కలిసి సమ్మె నోటీస్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరికృష్ణ రెడ్డి, ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యుడు మర్రిపూడి చిన్న, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పద్మ, వనజాక్షి, నిర్మల, కుమారి, తిరుపతమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హోమియోపతి ద్వారా వ్యాధి నివారణ సాధ్యం

## -- డా. పుల్లా ఉమా మహేశ్వరి

కాకినాడ రూరల్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : ఉమర్ ఆలీషా రురల్ డెవలప్మెంట్ ట్రస్ట్ పిఠాపురం వారి ఆధ్వర్యంలో పి.వెంకటాపురంలోని డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల మరియు జూనియర్ కళాశాల నందు చికెన్ పాక్స్ వ్యాధి నిరోధక మరియు కండ్లకలక నివారణకు హోమియోపతి మందుల ఉచిత పంపిణీ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. పాఠశాల ప్రిన్సిపాల్ అభ్యర్ధన మేరకు విద్యార్థుల్లో చికెన్ పాక్స్ మరియు కండ్లకలక వ్యాప్తిని నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యం.బి.యం.మల్టీస్పెషాలిటీ హోమియో క్లినిక్ కు చెందిన పిల్లల వైద్య నిపుణులు డా. పుల్లా ఉమా మహేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చికెన్ పాక్స్ వ్యాధి లక్షణాలు, వ్యాధి



వ్యాప్తి చెందే విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు సులభంగా వివరించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, కళ్లను మురికి చేతులతో తాకకపోవడం వంటి నివారణ చర్యలు ఎంతో ముఖ్యమని తెలిపారు. అదేవిధంగా హోమియోపతి మందులు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచి, వైరస్‌లను సమర్ధవంతంగా ఎదుర్కొనేలా సహాయపడతాయని, రోగనిరోధక శక్తి బలంగా ఉన్నప్పుడు వ్యాధుల బారిన పడే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. హోమియోపతి ద్వారా



వ్యాధి నివారణ సాధ్యమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. బి. ఆర్.అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాల మరియు జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.శశికళ, హెల్త్ సూపర్వైజర్ జి.చక్రమ్మ, ఉపాధ్యాయులు బి.లక్ష్మి, వి.మాధవి, హారిక, విద్యార్థులు మరియు ఉమర్ ఆలీషా రురల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సభ్యులు ఎస్.సాయి కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# ఉచిత మెగా వైద్య శిబిరం

తొండంగి, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : తొండంగి మండలం పి.ఈ.చిన్మయి పాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పేదలకు అన్ని




రకముల వైద్యం ఉచితంగా అందించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ఆరోగ్య సిబ్బంది డాక్టర్ రేవు లలిత కుమారి, కాకి ప్రసాద్, వర్ధనపు సుజాత, రావుల నాగమణి, కర్రీ రామారావు తదితర వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కల్తీ నెయ్యి ప్రసాదం వివాదం వైసీపీ వక్రభాష్యం బట్టబయలు!

**- భక్తుల మనోభావాలతో చెలగాటం  జనసేన నాయకుడు సూర్యప్రకాష్ సంచలన ఆరోపణలు**

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : "అక్రమాలకు వక్రభాష్యం చెప్పడమే వైసీపీ సంస్కృతిఢ ప్రజలను, భక్తులను పిచ్చోళ్లుగా మార్చే ప్రయత్నమే వారి రాజకీయ విధానం" అంటూ పిఠాపురం జనసేన నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ వాకపల్లి దేవి భర్త సూర్య ప్రకాష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్ర ప్రసాదమైన లడ్డు కల్తీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్న వేళ, ఈ అంశంపై వైసీపీ నేతలు వారుమాట్లాడుతున్న తీరు వారి అసలు స్వరూపాన్ని బయటపెడుతోందని ఆయన విమర్శించారు. మొదటలో నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదు... ఆవులు ప్లాస్టిక్ వ్యర్థాలు తినడం వల్లే ఇలా జరిగింది" అంటూ ప్రజలను తప్పుదారి పట్టించిన వైసీపీ పెద్దలు, ఇప్పుడు మళ్లీ మాట మార్చి "పామాయిల్, కెమికల్స్ కలిపిన నెయ్యి వాడాం" అంటూ కొత్త వాదనలు వినిపిస్తున్నారని సూర్యప్రకాష్ మండిపడ్డారు. ఇది కేవలం రాజకీయ డ్రామా కాదని, కోట్లాది మంది స్వామి భక్తుల మనోభావాలపై జరిగిన దాడి అని ఆయన స్పష్టం చేశారు. పరమపవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ఔన్నత్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వరుని ప్రతిష్టను కించపరిచే స్థాయికి వైసీపీ నాయకులు దిగజారారని తీవ్ర ఆరోపణలు చేశారు. తాజాగా దర్యాప్తు సంస్థలు కల్తీ జరిగినట్లు నివేదికలు ఇచ్చిన నేపథ్యంలో కూడా వైసీపీ నేతల్లో పాపభీతి కనిపించడం లేదని విమర్శించారు. తప్పు చేసిన వారు బహిరంగంగా క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇదే



సందర్భంలో సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు అరెస్టుపై వంగా గీత ఆవేదన వ్యక్తం చేయడాన్ని ప్రశ్నిస్తూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై బహిరంగ సభల్లో సభ్య సమాజం తలదించుకునేలా దూషణలు చేసినప్పుడు గీతకు ఎందుకు బాధ కలగలేదని సూటిగా నిలదీశారు. కోనసీమలో కులాల మధ్య చిచ్చుపెట్టి ఎంతమంది అమాయకులపై కేసులు పెట్టారో వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. మొత్తానికి లడ్డు కల్తీ వివాదం వైసీపీ పాలనలో సాగిన అక్రమాల ప్రతిబింబమని, ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసిన ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారబోతోందని సూర్యప్రకాష్ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పవిత్రత, విశ్వాసం, సంప్రదాయాలను రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టిన వైసీపీ నాయకత్వం తక్షణమే బాధ్యత తీసుకుని ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా హెచ్చరించారు.



# అందే కాశీరాజు నేత్రదానం

తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి (ఎలిపే నాగేశ్వరరావు) ఫిబ్రవరి 05 : తాళ్ళరేవు మండలం పి.మల్లవరం గ్రామానికి చెందిన తాళ్ళరేవు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు అందే కాశీరాజు గుండెపోటుతో అకస్మిక మరణం చెందారు. కుటుంబ సభ్యులు భార్య రాజామణి, కుమారుడు లక్ష్మణరావులతో ఆనాల భాస్కర్, విళ్ళ సత్యనారాయణ నేత్రదానం ప్రాముఖ్యతను వివరించి, ఇంతటి విషాద సమయంలో కూడా నేత్రదానం చేయించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు సిబ్బంది రవి ఆధ్వర్యంలో కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులను ధూళిపూడి వి.వి.సుబ్బారావు, బుజేష్, గొల్లబాబు, ఆనాల పాపారావు, సుబ్రహ్మణ్యం, జనార్ధన రావు తదితరులు పరామర్శించారు.

# మురమళ్ళలో భారీ రక్తదాన శిబిరం

తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి (ఎలిపే నాగేశ్వరరావు) ఫిబ్రవరి 05 : ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యుడు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పుట్టినరోజు సందర్భంగా మురమళ్ళ ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం దగ్గర ఉదయం ఎనిమిది గంటల నుండి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది రక్తదాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం లాంటిదని రక్తదానం ద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడవచ్చని, తన పిలుపుమేరకు రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ, ప్రోత్సహించిన వారికి, కూటమి నాయకులకు, మిత్రులకు, అభిమానులకు, ప్రజలకు, ప్రత్యేకంగా



అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంకు అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షుడు గుత్తుల సాయి, బి.సి.కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, ముమ్మిడివరం ఏ.ఎం.సి చైర్మన్ ఓగురి భాగ్యశ్రీ, మాజీ ఏఎంసీ చైర్మన్ మందాల గంగ సూర్యనారాయణ, తాళ్ళరేవు మండల జనసేన అధ్యక్షుడు అత్తిలి బాబురావు, ఐ.పోలవరం మండలం జనసేన అధ్యక్షుడు మద్దింశెట్టి పురుషోత్తం, కాట్రేనికోన మండలం జనసేన అధ్యక్షుడు మోకా బాలప్రసాద్, బళ్ళ కుమార్, విత్తనాల రవితేజ, నడింపల్లి వినోద్ రాజు, జి.సత్తిబాబు, బోనం శ్రీనివాస్, సలాది రాజు, బద్రి రమాదేవి, గిడ్డి రత్నశ్రీ, భాగ్యలక్ష్మి, సుందరపల్లి సత్యనారాయణ, బండారు దొరబాబు, చిక్కం రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com

సింహగర్జన
ఆదివారం ప్రత్యేకం



# నేనొక వింత మనిషిని..

నేను శిలను కాను..
బావిలో బందీ అయిన కప్పను అంతకన్నా కాను!
ప్రశాంత గంభీర సముద్రాన్ని నేను..
లోలోన వేదన అలలై ఎగసిపడే ఉప్పెనను నేను!

నేను రాతి మనిషిని కాను..
వెన్నలా కరిగిపోయే నవనీత హృదయుడిని!
కానీ, ఈ అంతర్జాలపు అద్దాల ముక్కల్లో..
కనిపించని నా అస్తిత్వాన్ని వెతుక్కుంటున్నాను.

నేనొక విజ్ఞానిని అని భ్రమపడుతూ..
విశ్వాన్ని చాపలా చుట్టేయాలని చూస్తున్నాను!
నింగికి నేలకు కృత్రిమ బంధాలు వేస్తూ..
ఆ మాయా లోకంలోనే సుఖాన్ని వెతుక్కుంటున్నాను.

నేనొక వింత మనిషిని..
నిత్యం కొత్త వింతలను సృష్టిస్తూ,
నాటక రంగంపై నా పాత్రను నేనే చూసుకుంటూ..
నేలపై తేలుతూ గాలిలో మేడలు కడుతున్నాను.

నేనొక ముసుగు మానవతావాదిని!
బయటకి పరుల కన్నీళ్లు తుడుస్తున్నా..
లోపల రాక్షసత్వపు నీడల్లో,
పైశాచికంగా నవ్వుకుంటూ గడుపుతున్నాను.

నేనొక కృత్రిమ కళాపిపాసిని..
ప్రకృతి సిద్ధమైన రంగులను కాలదన్ని,
ప్లాస్టిక్ రంగులతో కొత్త రూపాలను అద్దుతూ..
సహజత్వాన్ని వెక్కిరించే సృష్టిని చేస్తున్నాను.

అన్నీ తెలిసిన మేధావిని అని అహంకరిస్తూ..
సృష్టికి ప్రతిసృష్టి చేయాలన్న తాపత్రయంలో,
నన్ను నేను హింసించుకుంటూ..
నా స్వహస్తాలతో కురిపించుకున్న అగ్నివర్షంలో తడుస్తున్నాను!

– కొప్పుల ప్రసాద్
నంద్యాల
9885066235





# మేడారంలో ఘనంగా ముగిసిన తిరుగువారం

తెలంగాణ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : మేడారం మహాజాతరలో కీలకమైన తిరుగువారం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు కుటుంబసమేతంగా వచ్చి తల్లుల గద్దెలను, గుడి పరిసరాలను శుద్ధి చేసి, యాటను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుగువారంతో మేడారం మహాజాతర అధికారికంగా ముగిసిందని పూజారుల సంఘం ప్రకటించింది. కాగా మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ అమ్మవార్లను దర్శించుకున్నారు.

# రచయిత ఆళ్ళకు జీవితకాల సాఫల్య పురస్కార అవార్డు 2026 ప్రదానం

తెనాలి, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : ఓర్తి వెల్నెస్ ఫౌండేషన్ వారు వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి, ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా అందించే జీవిత సాఫల్య పురస్కార అవార్డ్ 2026కు గాను తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్, సాహితీబంధువు డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)ని ఎంపిక చేసి, ఆన్లైన్ వేదికగా గురువారం ప్రదానం చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు మరియు డైరెక్టర్ సౌమ్య భాజ్ పై సంతకంతో కూడిన అవార్డు ధ్రువీకరణ పత్రమును గురువారం డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ) గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దములుగా సాహిత్య రంగాన్ని ప్రవృత్తిగా స్వీకరించి తన వందలాది రచనల ద్వారా పరోక్షంగా సామాజిక సమస్యల పరిష్కార దిశగా రచనలు చేస్తూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పలు అవార్డులు అందుకుని, మాతృభాషా వికాసానికి అనుపమాన విశేష సేవలకు మరియు వృత్తిపరంగా ఏపీఎస్ఆర్టీసీ గుంటూరు 2 డిపోలో మూడు దశాబ్దములుగా కండక్టర్ గా విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, ప్రత్యక్షంగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ జీవిత సాఫల్య పురస్కార అవార్డును ఈ 2026గాను ఆన్లైన్ వేదికగా ప్రదానం చేయడం జరిగిందని తెలిపారు. జీవిత సాఫల్య పురస్కార అవార్డును అందుకున్న డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)ని విశ్వ సాహితీ కళావేదిక జాతీయ గౌరవ అధ్యక్షుడు డా. రంగిశెట్టి రమేష్ (గంగా శ్రీ), సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి కొల్లి రమావతి మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు, ఏపీఎస్ఆర్టీసీ గుంటూరు జిల్లా ప్రజా రవాణా అధికారిణి జి.సామ్రాజ్యం, గుంటూరు 2 డిపో మేనేజర్ సి.హెచ్.సునీత, ఎస్.టి.ఐ కె.మంగమ్మ, కార్మికులు, సిబ్బంది అభినందించారు.



# కాంగ్రెస్ సర్కార్‌పై నిరుద్యోగుల ఆగ్రహం



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 05 : తెలంగాణలో నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, 'హలో నిరుద్యోగి చలో ఇందిరాపార్కు' పేరుతో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్పించిన ఉద్యోగాలను తామే ఇచ్చామని కాంగ్రెస్ చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

# ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఏఎస్ఆర్ హోమియోపతి వైద్య కళాశాల

## - క్యాన్సర్‌పై సమగ్ర అవగాహన కార్యక్రమం సంస్థ యొక్క నిబద్ధతకు నిదర్శనం

తాడేపల్లిగూడెం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : ఏఎస్ఆర్ హోమియోపతి వైద్య కళాశాల, ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 4న క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, మరియు హోమియోపతి చికిత్సలో దాని కీలక పాత్ర, ఉపశమనంపై అవగాహన కల్పించడానికి పలు ప్రభావవంతమైన కార్యక్రమాలను నిర్వహించింది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన శిబిరాలు, అలాగే కళాశాల ప్రాంగణంలో ఒక విద్యా సదస్సుతో కూడిన ఈ సమగ్ర కార్యక్రమం, ఈ కీలక ఆరోగ్య రంగంలో కళాశాల యొక్క విస్తృత సామర్థ్యాలను చాటి చెప్పింది.

**- గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు**


ఉదయం సెషన్‌లో ఏఎస్ఆర్ హోమియోపతి వైద్య కళాశాల, ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ మరియు శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమ శాఖలైన బాల్లిపాడు, రేలంగి, మరియు పైడిపర్రు గ్రామాలలో మూడు అవగాహన శిబిరాలను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ ప్రజలకు క్యాన్సర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించడం, ముందస్తు గుర్తింపు మరియు నివారణ చర్యల ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం. ఈ శిబిరాల్లో క్యాన్సర్ చికిత్సలో హోమియోపతి వైద్యానికి ఉన్న పాత్ర మరియు దాని పరిధిని స్పష్టంగా వివరించడం జరిగింది. డా. డి.సాయిరాం, డా. కిరణ్మయి, డా. అజరుద్దీన్లతో పాటు అనేక మంది ఉత్సాహవంతులైన ఇంటర్న్‌లు మరియు విద్యార్థులు ఈ అవుట్రీచ్ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

**- కళాశాలలో అకాడమిక్ సెమినార్ మరియు పోస్టర్ ప్రదర్శనలు**

మధ్యాహ్నం ఏఎస్ఆర్ హోమియోపతి వైద్య కళాశాల సెమినార్ హాల్‌లో ఒక శక్తివంతమైన సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని సంవత్సరాల విద్యార్థులు మరియు ఇంటర్న్‌లు ఉత్సాహంగా పాల్గొని, క్యాన్సర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై లోతైన పోస్టర్ మరియు పవర్-పాయింట్ ప్రజెంటేషన్‌లను సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. డి.సురేంద్ర కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై విస్తృత అవగాహన




కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇది ముందస్తు గుర్తింపునకు దారితీసి, చికిత్సా ఫలితాలను గణనీయంగా మెరుగుపరుస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. ఆనంద కుమార్ పింగళి తన కీలక ప్రసంగంలో, క్యాన్సర్ చికిత్సలో హోమియోపతి వైద్యానికి ఉన్న అద్భుతమైన అవకాశాలను వివరించారు. కీమోథెరపీ మరియు రేడియోథెరపీ వంటి సంప్రదాయ చికిత్సలతో పాటు హోమియోపతి మందులను ఏకకాలంలో వాడటం ద్వారా రోగులు దుష్ప్రభావాలను తగ్గించుకోవచ్చని, తద్వారా వారి మొత్తం ఆరోగ్యం మరియు జీవన నాణ్యత మెరుగుపడుతుందని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా ఉపశమన సంరక్షణలో హోమియోపతి ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుందని, ఇది రోగులలో లక్షణాలను తగ్గించి, మెరుగైన జీవన నాణ్యతను అందిస్తుందని డా. పింగళి పేర్కొన్నారు. క్యాన్సర్ రంగంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి నిర్వహిస్తున్న పరిశోధనలు ఆశాజనకంగా ఉన్నాయని కూడా ఆయన హైలైట్ చేశారు. కళాశాల యొక్క అంకితమైన రోగి సంరక్షణ మౌలిక సదుపాయాలను డా. పింగళి గర్వంగా ప్రకటించారు. ఏఎస్ఆర్ హోమియోపతి వైద్య కళాశాల ప్రస్తుతం వివిధ ప్రత్యేకతలను కవర్ చేస్తూ 18 అవుట్ పేషెంట్ విభాగాలను నిర్వహిస్తోంది. ఇందులో ఒక ప్రత్యేక క్యాన్సర్ మరియు ప్యాలియేటివ్ కేర్ డివిజన్ కూడా ఉంది. మేము ఇటీవల ఒక ప్రత్యేక క్యాన్సర్ ఓపీడీని ప్రారంభించాము, ఇక్కడ మేము క్యాన్సర్ చికిత్సతో పాటు ఉపశమన సేవలను అందిస్తున్నాము అన్నారు. అంతేకాకుండా అటువంటి కేసులను అడ్మిట్ చేయడానికి మరియు సమగ్ర చికిత్సను అందించడానికి మాకు ఇన్‌పేషెంట్ విభాగం కూడా అందుబాటులో ఉంది అని ఆయన వివరించారు. ప్రతి రోగి మరియు ప్రతి కేసు విభిన్నంగా ఉంటుందని, కాబట్టి అర్హత కలిగిన హోమియోపతి వైద్యులను సంప్రదించి, వారి పరిస్థితిపై చర్చించి, వ్యక్తిగత చికిత్సా నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ,ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏఎస్ఆర్ హోమియోపతి వైద్య కళాశాల నిర్వహించిన ఈ కార్యక్రమాలు ప్రజారోగ్య విద్య పట్ల దాని నిబద్ధతను, గ్రామీణ సేవను, శాస్త్రీయ విద్యను మరియు క్యాన్సర్ & ప్యాలియేటివ్ కేర్‌లో దాని నిరంతర అంకితభావాన్ని స్పష్టంగా ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమాలలో అంకితమైన అధ్యాపకులు, ఇంటర్న్‌లు మరియు విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం విశేషంగా నిలిచింది.



# 450 బస్తాల రేషన్ బియ్యం సీజ్..

## స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాల వద్ద అధికారులు..

బాపట్ల జిల్లా, ఇన్చార్జి రేపల్లె 05..02.26భట్టిప్రోలు మండలం గొరిగపూడిలోని ఓ ప్రైవేటు గోదాంపై విజిలెన్స్, పౌరసరఫరాల అధికారుల బుధవారం రాత్రి దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 450 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీటీ ఓంకార్ తెలిపారు. వీటిని అక్రమంగా నిల్వ చేసిన నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో స్థానిక రెవిన్యూ పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు...!

# దేవస్థానం చైర్మన్‌ను సత్కరించిన మైనేని

బాపట్ల జిల్లా ఇన్చార్జి రేపల్లె
5.2.26 వేమూరు మండలం పెనుమర్రు గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మైనేని సత్యనారాయణ చౌదరి(భీమయ్య) వాడపల్లి దేవస్థానం చైర్మన్ ను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ గా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ముదునూరు వెంకటరాజు(గబ్బర్ సింగ్)ను గురువారం మైనేని, మర్యాదపూర్వకంగా చైర్మన్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయనను శాలువాతో పూలమాలతో ఘనంగా సత్కరించారు.

# వీఆర్వో డివిజన్ స్థాయి కోశాధికారిగా శివరామకృష్ణ

బాపట్ల జిల్లా ఇన్చార్జి రేపల్లె నియోజకవర్గం ,. 5.2.26
వివిధ జిల్లాల స్థాయిల వీఆర్వో సంఘాల పదవుల అలంకరణలో భాగంగా బాపట్ల జిల్లా రేపల్లె డివిజన్ కు సంబంధించి భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ వీఆర్వో పోతార్లంక వెంకట శివరామకృష్ణ రేపల్లె డివిజన్ స్థాయిలో కోశాధికారిగా ఏకగ్రీవంగాఎన్ని కయ్యారు. అదేవిధంగా బాపట్ల జిల్లా కమిటీలో భట్టిప్రోలు మండలం తరపున జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వీఆర్వో వి.చిట్టిబాబు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికైన ఇరువురిని మండల ఇన్చార్జి ఆర్ ఐ మండ్రు జక్రయ్య, వీఆర్వోల సంఘం అధ్యక్షులు పి కాళీ కృష్ణ,వీఆర్వోలు చొప్పర రవి కుమార్,నిశంకర లక్ష్మి,లంకె సురేష్,సిహెచ్ పుల్లయ్య,అంబటి ప్రసాద్,అబ్దుల్ కరీం బేగ్ తదితరులు అభినందించారు.

# ఈనెల 12న జరిగే దేశ వ్యాప్త సర్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం.

కోడుమూరు
కోడుమూరు. సిఐటియు మండల అధ్యక్షులు జిపి వీరన్న. ఆశా వర్కర్ల సంఘం కార్యదర్శి సుబేదా మరియు.ఆశా వర్కర్లు అందరూ కలిసి మెడికల్ ఆఫీసర్ కృష్ణమోహన్ వారికి ఈనెల 12వ తారీకున జరిగే సమ్మెకు సంబంధించి సమ్మె నోటీస్ ఇవ్వడ మైనది ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మికచట్టాలను మార్పు చేస్తూ కొత్తగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆశ వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆశ వర్కర్లను గుర్తించాలి అన్ని రకాల సెలవులు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలానే డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్తంగా జరిగే.సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు అన్నారు ఈ కార్యక్రమంలో. శ్రీదేవి. సరోజ. మద్దమ్మ. రేణుక. సరస్వతి. పద్మ. లక్ష్మి. పాల్గొన్నారు.

# వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోంది

ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది.ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు.అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్ ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## అనురాగ్ ఠాకూర్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట

భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) మాజీ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. బీసీసీఐలో ఎలాంటి పదవులు చేపట్టకుండా ఆయనపై దాదాపు 9 ఏళ్ల క్రితం విధించిన నిషేధాన్ని సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఎత్తివేసింది. 2017 జనవరిలో ఇచ్చిన పాత ఆదేశాలను సవరిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్య కాంత్, జస్టిస్ జాయ్మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. విధించిన నిషేధం జీవితకాలం కొనసాగేది కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. దాదాపు 9 ఏళ్లుగా నిషేధం కొనసాగుతోందని, ఈ విషయంలో ఠాకూర్ ఇప్పటికే బేషరతుగా క్షమాపణ చెప్పారని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. తాజా తీర్పుతో, బీసీసీఐ నిబంధనల ప్రకారం బోర్డు అంతర్గత, పరిపాలనా వ్యవహారాల్లో పాల్గొనేందుకు ఠాకూర్‌కు మార్గం సుగమమైంది.భారత క్రికెట్ కు సంబంధించి, జస్టిస్ ఆర్.ఎం. లోధా కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి నిరాకరించారన్న కారణంతో 2017 జనవరి 2న అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్‌పై సుప్రీంకోర్టు వేటు వేసింది. కోర్టు ఆదేశించిన సంస్కరణల అమలులో బీసీసీఐ నాయకత్వం మొండిగా వ్యవహరించిందని అప్పటి సీజేఐ జస్టిస్ టీ.ఎస్. ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ఠాకూర్‌తో పాటు కార్యదర్శి అజయ్ షిర్కేను కూడా తొలగించి, బీసీసీఐ పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

# దేశ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది

.గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దులో కంచె ఏర్పాటును అడ్డుకుంటోందని కేంద్రం, బీజేపీ నేతలు చేసిన ఆరోపణలను ఆమె కొట్టిపారేశారు. బీఎస్ఎఫ్‌తో సహా అన్ని కేంద్ర సంస్థలు, ఏజెన్సీలకు ఇప్పటికే భూమిని అందించామని తెలిపారు. దేశ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మమతా బెనర్జీ అన్నారు. కంచె విషయంలో భూమి అనేది సమస్య కానే కాదని అన్నారు.ఎంత భూమి అవసరమైతే అంత కేటాయిస్తామని, కానీ బీఎస్ఎఫ్ అధికార పరిధిపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. కంచె విషయంలో కొన్ని వాస్తవాలనే బీజేపీ ప్రజల ముందు ఉంచుతోందని ఆరోపించారు. రాష్ట్రం ఇప్పటికే ఎంత భూమిని ఇచ్చిందనే వివరాలను కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.బెంగాల్‌లో చొరబాట్లు ముప్పుగా పరిణమించాయని, కంచె కోసం భూమి కోరుతూ కేంద్రం పలుమార్లు లేఖలు రాసినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఆరోపించారు. అయితే చొరబాట్లపై సాక్ష్యాలను చూపించాలని మమతా బెనర్జీ సవాల్ చేశారు. కంచె కోసం ఇప్పటికే కేటాయించిన భూమిలో ముందుగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

# ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యం

రాష్ట్రంలో ఉన్న 40 జీవనదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే కరవు అనే మాటే వినిపించదని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రాన్ని, ఇప్పుడు రైతులకు అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తున్నామని తెలిపారు.సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తున్నందున, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాల్సిన బాధ్యత వాటిపైనే ఉందని సీఎం దిశానిర్దేశం చేశారు. నీటి పన్నులు వసూలు చేసుకుని, ఆ నిధులతో కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చని సూచించారు. రాష్ట్రంలో 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సరైన సమయంలో నీరందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇస్తూ, భూగర్భ జలాల పెంపు, కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణలో సంఘాలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బొగ్గు గనిలో పేలుడు..

మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్ఖె ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు:

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, ఇందులో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని ఆయన గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, భగవంతుడి ముందు వారు మోకరిల్లే వరకు తమ యుద్ధం ఆగదని హెచ్చరించారు.నెయ్యి పేరుతో పామాయిల్, ప్రమాదకరమైన రసాయనాలు వాడి భక్తుల మనోభావాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై మాట్లాడేటప్పుడు తాము అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడారు.పవన్ కల్యాణ్ తన ఆరోపణలకు సంబంధించిన గణాంకాలను కూడా మీడియా ముందుంచారు. "తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్" అని పవన్ వివరించారు. ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు.గత ప్రభుత్వానికి దేవుడిపై, హిందూ సంప్రదాయాలపై పగ ఉందని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "వీరికి ఏడుకొండల స్వామిపై ఎందుకో పగ. ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు అన్న చరిత్ర వీరిది. వీరు వ్యక్తులపై, ప్రత్యర్థులపై కాదు, ఏకంగా భగవంతుడిపైనే పగబట్టారు. ఈ కుట్ర వెనుక ఉన్న వారి వారసత్వం, వారి పరంపర ఎలాంటిదో ప్రజలు గమనించాలి. అందుకే ఈ అంశాన్ని సరిదిద్ది, వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. "గత ఐదేళ్లలో, అంటే 2019 నుంచి 2024 వరకు, రాష్ట్రంలో వైసీపీ పాలనలో హిందూ ధర్మానికి, దేవాలయాలకు తీరని అపచారాలు జరిగాయి. ఇవి చాలా సున్నితమైన అంశాలు. మత విశ్వాసాలతో ముడిపడి ఉన్న విషయాలపై ఆనాటి ప్రభుత్వ పెద్దలు చూపిన నిర్లక్ష్యం, వారి బాధ్యతారాహిత్యం ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి.ఉదాహరణకు, రామతీర్థంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తి విగ్రహ శిరచ్ఛేదనం జరిగితే, దాన్ని ఎవరో ఆకతాయి చేసిన పనిగా తేల్చేశారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే, దానిని ఎవరో పిచ్చోడి చర్యగా చిత్రీకరించి చేతులు దులుపుకున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో వెండి సింహాలు మాయమైతే, 'అవి పోతే ఇంకొకటి కొంటాం, వాటితో ఏమైనా మేడలు, మిద్దెలు కడతామా?' అని అప్పటి మంత్రులు ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడారో ప్రజలు మర్చిపోలేదు. ఇక అంతర్వేదిలో పవిత్రమైన రథం కాలిపోతే, దాన్ని మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనిగా తేల్చేసి కేసును పక్కన పెట్టేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినా, ఆనాటి ప్రభుత్వంలో ఒక్కరు కూడా బాధ్యతగా మాట్లాడటం గానీ, కఠిన చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు.మేం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇలాంటి పాత విషయాలపై ఆరోపణలు, విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం మాకేముంటుంది? మా దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నాం. జరిగిన వాస్తవాలు మాకు తెలిసి కూడా ప్రజలకు చెప్పకపోతే, భవిష్యత్తులో వారే మమ్మల్ని నిలదీస్తారు, 'మీకు తెలిసినా ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని అడుగుతారు. అందుకే బయటకు వచ్చి మాట్లాడుతున్నాం.గత ఐదేళ్లలో హైందవ సంస్కృతి, మన ధర్మంపై వైసీపీ ప్రభుత్వం తరచుగా దాడులకు, అపవిత్ర కార్యాలకు తెగబడింది. అందుకే దీనిపై మాట్లాడాల్సిన, ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం జరిగిన తప్పులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, ఎదురు మాపైనే విమర్శలు చేస్తున్నారు. ఒకటే విషయాన్ని స్పష్టంగా చెప్తున్నాను... భగవంతుడి మీద పగ పెట్టుకున్నవాడు ఎవడైనా సరే సర్వనాశనం అయిపోతాడు. చరిత్రలో అలా బతికి బట్ట కట్టిన దాఖలాలు కూడా లేవు. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి" అని పవన్ తీవ్ర హెచ్చరికలు చేశారు


# బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం

తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినప్పటికీ ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారని, కానీ ప్రజల ఆకాంక్షలను వారు నెరవేర్చలేకపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే తమపై కొంతమంది విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని ఆ కుటుంబం దాడి చేస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ నెల నెలా వేతనం తీసుకుంటున్నారు కానీ సభకు మాత్రం రావడం లేదని, ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని ఆయనకు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించిందని ఆరోపించారు.మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడిని తీసుకువచ్చిందని, కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేశాకే వారు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు మీరేం చేశారని బీజేపీ ప్రశ్నిస్తోందని, కానీ పదేళ్లు వారేం చేశారో చెప్పడం లేదని చురక అంటించారు. మోదీ, అమిత్ షా ఎవరిని తీసుకొచ్చినా మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు బీజేపీ గెలవదని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు.అలాంటప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణకు ఎందుకోసం వచ్చినట్లని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో సీబీఐ విచారణ చేయించాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిస్తే కేంద్రం స్పందించలేదని మండిపడ్డారు. ఫార్ములా ఈ రేసు కేసులో చర్యలు తీసుకోవాలని కోరినా స్పందించడం లేదని ఆరోపించారు. మెట్రో రైలు మంజూరు చేయలేదని, మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వలేదని అన్నారు. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని మోదీ, అమిత్ షా కూడా అన్నారని గుర్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. వెయ్యి బస్సులకు ఆడబిడ్డలను యజమానులుగా చేశామని, రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఆడబిడ్డల చీరల్లో కూడా కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

# డా.పాదర్తి ని కలిసిన జబర్దస్త్ కమెడియన్ ఆర్టిస్ట్ లు

కావలి,

బుధవారం నాడు డా.పాదర్తి నాగరాజు ఆరోగ్యం బాగోలేదు అని తెలుసుకొని కావలి లో పోగ్రామ్ నిమిత్తం వచ్చి, పాదర్తి ని కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు చూచిన మేరకు నడుసుకోవాలి అని,అశ్రద్ధ చేయకుండా టైం కు మందులు వాడాలి అని తెలిపారు.తదనంతరం జబర్దస్త్ ఆర్టిస్టులను శాలువా లు సత్కరించి వారి పట్టణం అభిమానాన్ని చూపించారు వారు కూడా అంతే అభిమానాన్ని పాదర్తిని సత్కరించి కావలి కి వస్తే మా పాదర్తిఉన్నాడని అందరి ముందు చప్పడం విశేషం.ఈ కార్యక్రమంలో పాదర్తి ప్రసాద్ రావు,పాదర్తి ఉదయ్ కుమార్ కావలి చిన జియ్యర్ స్వామి కె.శ్రీనివాస





ఆచార్యులు,గాథం శెట్టి వేణుగోపాల్,యేల్చురి రవి,సువర్ణ శ్రీనివాసులు, పెట్టుగాని రమేష్, పెసల పవన్,తదితరులు పాల్గొన్నారు